సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



..దద్దుర్లు వస్తున్నాయి

కొన్ని రోజులు ఆగితే ధర పెరుగుతుందనే ఆశతో రైతులు పత్తిని ఇళ్లలో నిల్వ చేస్తే చర్మవ్యాధులు వస్తున్నాయి.

8లో



పోరాడేది ఎర్రజెండాలే..

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేది ఎర్ర జెండాలు మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

8లో

గరిష్టం / కనిష్టం
43° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం భానుడి భగభగలు అధికంగానే ఉంటాయి. సాయంత్రం వరకూ వాతావరణం వేడిగానే ఉంటుంది.



న్యూస్‌రీల్

నేత్రపర్వంగా శ్రీ బాలాజీ కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండలకేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా గావించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ పాల్గొన్నారు.


నేటి నుంచి నూతన ఆర్జిత సేవలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి నూతన ఆర్జిత సేవలు ప్రారంభించనున్నట్లు ఈఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదాశీర్వచనం, స్వామికి తులసీమాల అలంకరణ, నిత్య సర్వ కైంకర్య సేవ, శ్రీరామనవమి ముత్యాల సమర్పణ, నిత్య పూల అలంకరణ సేవ, తులాభారం వంటి ఆర్జిత సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో గైనకాలజీ, అనస్తీషియా, రేడియాలజీ, పిల్లల వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిన నియమించే ఈ పోస్టులకు ఆసక్తి, అర్హత గలవారు జిల్లా ఆస్పత్రి ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ లేదా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సమర్పించాలని సూచించారు.

10 కరోనా కేసులు నమోదు



దుమ్ముగూడెం/ఇల్లెందు రూరల్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం 10 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దుమ్ముగూడెం మండలం సింగవరం పంచాయతీ పరిధిలోని వైట్‌నాగరంలో ఐదుగురు కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. వారిలో ఇద్దరు భద్రాచలం ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా కరోనా లక్షణాలు కనిపించాయి. వెంటనే మరో ముగ్గురిని పరీక్షించగా వారికీ పాజిటివ్ లక్షణాలే ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మందులు అందించి జాగ్రత్తలు పాటించాలని వైద్యసిబ్బంది సూచించారు. ఇక ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో 25 మందికి పరీక్షలు చేయగా ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. పట్టణంలోని 14 నంబర్ బస్తీ, కోర్టు ఏరియా, మండలంలోని తీగలంచ, బాలాజీనగర్, పోలంపల్లి గ్రామాలకు చెందిన వారు బాధితులుగా గుర్తించారు.

'మిషన్ వాత్సల్య' అమలులో లేదు

అశ్వాపురం: రాష్ట్రంలో మిషన్ వాత్సల్య పథకం అమలులో లేదని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో అర్హులైన వారు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతోందని, దీంతో సామాన్య ప్రజలు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. పథకం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అధికారికంగా ప్రకటన చేస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

కొంగొత్త అందాలతో..



చెరువు కట్ట కింద ఏర్పాటుచేసిన పార్క్

ఇల్లెందు చెరువు సుందరీకరణ

- మినీ ట్యాంక్‌బండ్.. లేక్‌వ్యూ పార్క్ ఏర్పాటు
- రూ.3.37 కోట్లతో అభివృద్ధి పనులు
- లైటింగ్, అలుగు, రోడ్డు నిర్మాణాలు పూర్తి



ట్యాంక్ బండ్ వద్ద ప్రమాదాల నివారణకు నిర్మించిన రక్షణ గోడ

సండే స్పెషల్

ఇల్లెందు: ఇల్లెందు మంచినీటి చెరువు సరికొత్త అందాలతో ఆకట్టుకుంటోంది. త్వరలో మినీ ట్యాంక్‌బండ్‌గా జలకళ సంతరించుకోనుంది. అటు చెరువు, ఇటు పార్క్ మధ్యలో కట్ట మీద ఆహ్లాదం అలుముకునేలా లైటింగ్, వాకింగ్ ట్రాక్, అలుగు, బతుకమ్మ ఘాట్, కట్ట వెంట పచ్చదనం ఉట్టిపడేలా పార్కింగ్, దాని కోసం స్ప్రింక్లర్ సెట్టింగ్.. ఇలా అనేక సుందరీకరణ పనులు చేపడుతున్నారు. చెరువు అభివృద్ధికి రూ.1.62 కోట్లు, లేక్‌వ్యూ పార్క్‌కు రూ.1.75 కోట్లు మంజూరయ్యాయి.

నెరవేరనున్న కల..

ఇల్లెందు మంచినీటి జలాశయాన్ని ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు 2018 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. కొంత పని చేపట్టాక టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. తర్వాత ఆ పనులను మరో కాంట్రాక్టర్ చేజిక్కించుకుని పనులు ముమ్మరం చేశారు. ఏడాది కాలాంగా పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే సుందరీకరణ పనులు తుది దశకు చేరుకోగా, మరో 10 రోజుల్లో పూర్తిచేసి మున్సిపాలిటీకి అప్పగించనున్నారు. ఇలా ఇల్లెందు వాసుల కల త్వరలోనే సాకారం కానుంది.

జలాశయం తీరిదీ..

బ్రిటిష్ వారు ఇల్లెందులో బొగ్గు నిక్షేపాలు కనుగొన్న కాలంలో సుమారు 120 ఏళ్ల క్రితం స్థానికుల దాహార్తి తీర్చేందుకు ఇల్లెందులపాడులో జలాశయం ఏర్పాటు చేశారు. ఒక్కసారి నిండితే ఏడాది పొడవునా పట్టణ వాసులకు నీరందించే ఈ చెరువు.. క్రమేణా పూడికతో నిండిపోయింది. ప్రస్తుతం ఉన్న 35వేల జనాభాకు నీరందించలేని స్థితికి చేరింది. ఇందులో రెండు గుమ్మసాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు నీరు సరఫరా చేశారు. అక్కడి నుంచి ఫిల్టర్ అయిన నీటిని పట్టణంలోని వాటర్ ట్యాంకులకు ఎక్కించేవారు. ఈ జలాశయం నుంచి పట్టణ ప్రజలకు తాగునీరందించేందుకు అధునాతన టెక్నాలజీతో గ్రావిట్ ర్యాపిడ్ ఫిల్టరైజేషన్ పద్ధతిని అందుబాటులోకి తెచ్చారు. దీన్ని 2006లోనే రూ.8.63 కోట్లతో నాటి సీఎం దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేయించారు. అయితే ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ వస్తుండడంతో వేసవికాలంలో రెండు నెలలు మాత్రమే ఈ చెరువు నీటిని వాడుతున్నారు. ఇక జలాశయం సుందరీకరణ పనులు పూర్తయితే బోటింగ్‌కు కూడా అవకాశం ఉంటుంది.

రూ.1.62 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్

ఇల్లెందు చెరువుపై మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.62 కోట్లు విడుదల చేసింది. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో నీటి మట్టం పెరగనుంది. ఇప్పటికే అలుగు మరమ్మతు, చుట్టూ కంచె ఏర్పాటు, కట్ట ఎత్తు, వెడల్పు పనులు పూర్తయ్యాయి. బతుకమ్మ ఘాట్ సైతం పూర్తయింది. కట్ట కింద భాగంలో పార్క్ అభివృద్ధి చేశారు. కట్టపైన లైటింగ్, రోడ్, బెంచీల ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ పనులు తుది దశకు చేరాయి. ట్యాంక్‌బండ్ పనులు పూర్తయితే ఏడాదంతా నీటితో చెరువు కళకళలాడుతుంది.

త్వరలోనే పూర్తవుతాయి..



పట్టణానికి ఎంతో మేలు జరిగే అవకాశం ఉన్న మంచినీటి చెరువు మినీ ట్యాంక్‌బండ్‌గా మారనుంది. దీంతో కట్టపై పర్యాటకులు సందడి చేసే అవకాశం ఉంటుంది. దాని పక్కనే లేక్‌వ్యూ పార్క్, అటు పెద్దమ్మ గుడి, ఇటు కాళీమాత ఆలయం, బతుకమ్మ ఘాట్‌తో సందడి వాతావరణం నెలకొంటుంది. త్వరలోనే పార్క్, మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తవుతాయి.

–దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

పార్క్ అభివృద్ధి చెందితే కళకళ..



ఇల్లెందులపాడు మంచినీటి చెరువు, దాని పక్కన పార్క్ అభివృద్ధి చెందితే ఆ ప్రాంతం జనసందోహంతో కళకళలాడుతుంది. గతంలో పార్క్ బాగా సాగిన క్రమంలో ఆహ్లాదం కోసం ఎంతో మంది వచ్చి వెళ్లేవారు. ఇక ఆదివారం వస్తే సందడిగా ఉండేది. ఈ దఫా అన్నింటికి భిన్నంగా పార్క్, చెరువు, అలుగు, కాళీమాత టెంపుల్ అన్నీ 2వ వార్డు పరిధిలో ఉండటంతో మా వార్డుకు జన సంచారం పెరిగే అవకాశం ఉంటుంది.

– కటకం పద్మావతి, 2వ వార్డు కౌన్సిలర్



ఇల్లెందు జలాశయం

'భద్రాద్రి' భారమైందా ?

- జిల్లాను పట్టించుకోని ఎంపీ కవిత
- అధికారిక కార్యక్రమాలకు మొక్కుబడిగా హాజరు
- పార్టీ సమావేశాలకు పూర్తిగా దూరం
- భద్రాచలం ఇన్‌చార్జ్ బాధ్యతలపై విముఖత



శ్రీరామనవమి వేడుకల్లో ఎంపీ కవిత (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం వరంగల్, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తరించి ఉంది. ఇందులో ములుగు, వరంగల్ జిల్లాల్లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మహబూబాబాద్‌లో రెండు ఉన్నాయి. అత్యధికంగా భద్రాద్రి జిల్లాలోనే ఇల్లెందు, పినపాక, భద్రాచలం మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ సభ్యురాలిగా ఈ జిల్లానే మాలోత్ కవితకు కీలకం. అయితే ఆమె ఏడాది కాలంగా జిల్లాకు దూరంగా ఉంటున్నారు. అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే మొక్కుబడిగా పాల్గొంటున్నారు తప్ప పార్టీ కార్యక్రమాలను అసలు పటించుకోవడం లేదని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ భాగం ఉన్న ప్రాంతాన్ని ఎంపీ కవిత నిర్లక్ష్యం చేయడం సరికాదని కార్యకర్తలు అంటున్నారు.

ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించండి..

ఈనెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలో ప్రణాళిక రూపొందించింది. 10 గ్రామాలకు ఒకటి చొప్పున ఆత్మీయ సమ్మేళనం, ఈనెల 25న నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది. ఎన్నికల ఏడాది కావడంతో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో అధిష్టానం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. పార్టీ రూపొందించిన కార్యక్రమాల నిర్వహణను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు అప్పగించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేని చోట ఆ బాధ్యతలను సెగ్మెంట్ పరిధిలో ఉండే ఇతర ప్రజాప్రతినిధులకు అప్పగిస్తోంది. ఈ క్రమంలో భద్రాచలం నియోజకవర్గానికి ఎంపీ మాలోత్ కవిత, కంటోన్మెంట్‌కు మర్రి రాజశేఖరరెడ్డి, గోషామహల్‌కు నంద కిశోర్ వ్యాసను ఇన్‌చార్జ్‌లుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 9న నియమించారు. అయితే భద్రాచలం ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా ఎంపీ కవిత కోరడంతో తిరిగి జిల్లాకు చెందిన బాలసాని లక్ష్మీనారాయణను నియమించారు. స్వయంగా ఎస్టీ అసెంబ్లీ సెగ్మెంట్ అయిన భద్రాచలం బాధ్యతలను బీఆర్ఎస్ అధిష్టానం మాలోత్ కవితకు అప్పగించింది. వచ్చే ఎన్నికల్లో కేడర్‌ను సన్నద్ధం చేయడంతోపాటు ఎంపీగా ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమాల పర్యవేక్షణ సులువవుతుందని బీఆర్ఎస్ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి బాధ్యతల నుంచి తప్పించాలని ఎంపీ కవిత కోరడంపై స్థానిక బీఆర్ఎస్ నేతలు కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ సెగ్మెంట్‌లోని అసెంబ్లీ నియోజకవర్గమైన భద్రాచలంలో పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ కార్యక్రమాలను పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

మహాధర్నాకూ డుమ్మా..

ఇటీవల పార్టీ పిలుపు మేరకు కొత్తగూడెంలో భారీ ఎత్తున మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలోనే ఉంది. అంతేకాదు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. ఈ నియోజకవర్గాల ప్రతినిధిగా పార్టీ ఏర్పాటు చేసిన ధర్నాకు ఎంపీ కవిత గైర్హాజరయ్యారు. ఇదే సమయంలో తన నియోజకవర్గంలో లేకపోయినా జయశంకర్ జిల్లా భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన సింగరేణి మహాధర్నాలో పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లా వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. జిల్లాలో పార్టీ పరంగా జరిగే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నా భద్రాచలం రాముడి దర్శనానికి క్రమం తప్పకుండా వస్తున్నారు. దేవుడితోపాటు తమ ప్రాంతంపై కూడా కొంచమైనా ధ్యాస ఉంటే బాగుంటుందని బీఆర్ఎస్ కేడర్ అభిప్రాయపడుతోంది.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేడుకకు హాజరైన భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిత్యకల్యాణ వేడుకలో 86 జంటలు పాల్గొని రూ.17,245 స్వామి వారికి కట్నాలుగా సమర్పించారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



డీఆర్‌ఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న తమను తక్షణమే క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెబాట పడతామని హెచ్చరించారు. ఈ మేరకు ఐడీఓసీలో జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తికి శనివారం సమ్మె నోటీసు అందించారు. అనంతరం డీపీఓ కార్యాలయంలో కూడా సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌తో విధుల్లో చేరిన తమకు మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ 26 విడుదల చేసిందని, ఆ గడువు కూడా ఈనెల 12తో పూర్తయిందని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్య పరిష్కరించకుంటే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. కాగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆందోళనకు తెలంగాణ పంచాయితీ సెక్రటరీస్ అసోసియేషన్ నాయకులు మద్దతు ప్రకటించారు.

'ఆరోగ్య మహిళ'లో 56 రకాల పరీక్షలు

డీఎంహెచ్‌ఓ శిరీష వెల్లడి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద మహిళలకు 56 రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం 'ఆరోగ్య మహిళ'పై ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ఎంపీ బంజర, ఎరగ్రుంట, పెనగడప, కొమరారం, పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పైలట్ ప్రాజెక్ట్‌గా గుర్తించి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మంగళవారం మహిళల రక్త నమూనాలు సేకరించి రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, నోటి కేన్సర్ వంటి 56 రకాల పరీక్షలు చేస్తామని వివరించారు. సమస్య ఉన్నవారిని జిల్లా ఆస్పత్రికి పంపించి చికిత్స అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి జిల్లాలోని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ మణికంఠా రెడ్డి, డాక్టర్ చైతన్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

వీడని చిక్కుముడి !

- భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించిన ప్రభుత్వం
- ఆ బిల్లును వెనక్కు పంపిన గవర్నర్
- ప్రభుత్వ తదుపరి నిర్ణయంపై ఉత్కంఠ
- ఆర్టికల్ 200 అమలు చేస్తే కాలాతీతమే !



భద్రాచలం వ్యూ

భద్రాచలం: ఐదేళ్లుగా అంతుపట్టకుండా ఉన్న భద్రాచలం గ్రామపంచాయతీ సమస్యకు మరింతగా చిక్కుముడి పడింది. పంచాయతీని మూడుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును గవర్నర్ తిరస్కరించారు. అయితే ప్రభుత్వం పట్టువీడి ఒకటే పంచాయతీగా కొనసాగిస్తుందా లేక రెండోసారి అసెంబ్లీలో ఆమోదింపజేసి మళ్లీ గవర్నర్ వద్దకు పంపుతుందా అనేది ఉత్కంఠగా మారింది.

తెలంగాణ ఆవిర్భావానికి ముందు 2013లో భద్రాచలం గ్రామపంచాయతీ చివరి పాలకవర్గం కొలువుదీరింది. 2018 ఆగస్టులో పాలక మండలి పదవీకాలం ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో భద్రాచలాన్ని భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ పంచాయతీలుగా, సారపాకను సారపాక, ఐటీసీ పంచాయతీలుగా విభజిస్తున్నట్లు జీఓ 45ను ప్రభుత్వం విడుదల చేసింది. భద్రాచలంలో 21 వార్డులు, సీతారాంనగర్‌లో 17 వార్డులు, శాంతినగర్‌లో 17 వార్డులు, సారపాకలో 17 వార్డులు, ఐటీసీ గ్రామ పంచాయతీలో 15 వార్డులుగా నిర్ణయిస్తూ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో బిల్లు ఆమోదింపజేసి గవర్నర్ ఆమోదానికి పంపారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆ బిల్లును గవర్నర్ తమిళిసై ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపారు.

రెండోసారి ఆమోదిస్తారా..

ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్ర గవర్నర్ ఆమోదం లేనిదే ఏ బిల్లూ శాసనంగా మారదు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లును గవర్నర్ తిరస్కరించి పునఃపరిశీలనకు పంపితే శాసనసభ అదే బిల్లును సవరణతో లేదా సవరణలు లేకుండా రెండో సారి ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు పంపవచ్చు. ఇలాంటి సమయంలో గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాలి లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపాలి. అదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు గ్రామపంచాయతీల విభజనను మెజార్టీ పార్టీలు, సంఘాలతో పాటు అత్యధిక మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలాన్ని ముక్కలుగా చేశారని, మళ్లీ విభజించి ఆధ్యాత్మిక క్షేత్రానికి విలువ తగ్గిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పలుమార్లు పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, గవర్నర్ తమిళిసై దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. భద్రాచలంలో ప్రతిపక్షాలతో కలిసి నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టారు. అయితే ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం మనసు మార్చుకుని ఒకే పంచాయతీగా కొనసాగిస్తుందా లేక మూడుగా విభజిస్తూ మళ్లీ బిల్లు ఆమోదిస్తుందా అనే ఆసక్తి స్థానిక ప్రజల్లో నెలకొంది. ఇక రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే అసెంబ్లీ రద్దయినా ఆ బిల్లులు రద్దు కావని సుప్రీంకోర్టు గతంలో కేరళకు చెందిన ఓ కేసులో తీర్పు చెప్పింది.

ఆర్టికల్ 200 ఉపయోగించుకుంటే..?

ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించడానికి, తిరస్కరించడానికి, ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపే విషయంలో ఎలాంటి కాలపరిమితి లేదు. ఇదే విషయాన్ని కేపి కొచానుజన్ కేసులో సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. దీనిని బట్టి ప్రభుత్వం రెండోసారి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపినా ఆ బిల్లును తప్పనిసరిగా నిర్ణీత సమయంలో ఆమోదించాలని లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం, దానిపై గవర్నర్ ఆ బిల్లును ఆమోదిస్తారా లేదా ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్రపతికి పంపుతారా అనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొని ఉంది. ఇదే జరిగితే భద్రాచలం పాలకమండలిపై ఇప్పటికిప్పుడు రాజకీయ నాయకులు, ప్రజలు పెట్టుకున్న ఆశలు వదులుకోవాల్సిందేనని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

టీఎస్‌టీటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక


శంకర్‌నాయక్ రమేష్‌బాబు

ఇల్లెందు: టీఎస్‌టీటీఎఫ్ జిల్లా నూతన కమిటీని శనివారం ఇల్లెందులో ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా భుక్యా శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా వాంకుడోతు రమేష్‌బాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయనున్నట్లు తెలిపారు. బానోతు వీరూనాయక్, లకావత్ శర్మనాయక్, మాలోతు శివనాయక్ పాల్గొన్నారు.

తునికాకు బోనస్ చెల్లించాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

దుమ్ముగూడెం: తునికాకు బోనస్ చెల్లించకపోతే ఈ ఏడాది ఆకు కోసేది లేదని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మీడియం బాబూరావు స్పష్టంచేశారు. మండల కేంద్రంలోని ములకపాడు సెంటర్‌లో యలమంచి సీతారామయ్య భవనంలో శనివారం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 నుంచి 2022 వరకు తునికాకు కార్మికులకు బోనస్ చెల్లించలేదని ఆరోపించారు. ఇకనైనా బోనస్ విడుదల చేయకపోతే ఈసారి తునికాకు కోసేదే లేదని తెలిపారు. అలాగే, పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి హక్కుపత్రాలు, సీతమ్మసాగర్ ప్రాజెక్టుతో భూమి కోల్పోయిన వారికి మెరుగైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు ముచ్చా వెంకటేశ్వర్లు, యలమంచి రవికుమార్, కె.బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, మర్మం చంద్రయ్య, కొరసా చిలకమ్మ, మర్మం సమ్మక్క, కూరం వీరభద్రం, ఖాదర్ బాబు, సరియం ప్రసాద్, సర్పంచ్‌లు తోడం తిరుపతిరావు, పునెం కనకదుర్గ, మిడియం జయ, బోల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశ్వేశ్వరరావు సేవలు మరువలేనివి


మహిళలకు చీరలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో వ్యాపార రంగానికి సంబంధించి తాటిపల్లి విశ్వేశ్వరరావు సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల కన్నుమూసిన విశ్వేశ్వరరావు సంతాప సభ శనివారం ఏర్పాటుచేయగా కూనంనేని మాట్లాడుతూ వస్త్రరంగంలో ఆయన అందరి మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మితో పాటు కొదుమూరి శ్రీనివాస్, తాటిపల్లి శంకర్‌బాబు, వైద్యుల నాగరాజు, కనకరాజు, ప్రవీణ్, వసుంధర-సుమంగళి సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పాల్వంచరూరల్: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామపంచాయతీ రేపల్లెవాడ గ్రామానికి చెందిన నెమలిపురి నవీన్ ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా 28 క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభ్యమయ్యాయి. బియ్యం స్వాధీనం చేసుకుని, నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మహిళల ఘర్షణ

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌లో శనివారం పలువురు మహిళలు ఘర్షణ పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. సంజయ్‌నగర్‌లో దుకాణ నిర్వాహకురాలైన శాంతమ్మ తన దగ్గరకు సరుకుల నిమిత్తం వచ్చిన వారితో అసభ్యంగా మాట్లాడిందని ఆరోపిస్తూ బస్తీకి చెందిన పలువురు మహిళలు శాంతమ్మ, ఆమె కుమార్తె సృజనలపై దాడి చేశారు. ఈ ఘటనలో సృజనకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈఘటనపై శాంతమ్మ, బస్తీ మహిళలు ఇరువురు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, హేమచంద్రాపురం నుంచి ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని, ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

ధర వస్తదనుకుంటే...


చర్మంపై ఏర్పడిన దద్దుర్లు

దద్దుర్లు వస్తున్నాయి..

గిట్టుబాటు రేటు లేక ఇళ్లలోనే పత్తి నిల్వలు
- పురుగుమందుల ప్రభావంతో చర్మ, శ్వాసకోశ సమస్యలు
- అనారోగ్యం బారిన పడుతున్న రైతు కుటుంబాలు


ఓ ఇంట్లో నిల్వ చేసిన పత్తి

బూర్గంపాడు: గిట్టుబాటు ధర లేపోవడంతో ఇంకొన్ని రోజులు ఆగితే రేటు పెరుగుతుందేమోననే ఆశతో రైతులు పత్తిని ఇళ్లలోనే నిల్వచేశారు. నెలల తరబడి ఎదురుచూస్తున్న గిట్టుబాటు ధర లభించటం లేదు. మరోవైపు పెట్టుబడికి తెచ్చిన అప్పులు, వడ్డీలు పెరిగిపోతున్నాయి. దీనికితోడు పత్తి నిల్వ చేసిన రైతులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇళ్లలో నిల్వచేసిన పత్తితో రైతు కుటుంబాలు చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. పలువురికి చర్మం ఎర్రగా కందిడిపోయి, ఒంటిపై దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. నెలల తరబడి పత్తి ఇళ్లలో నిల్వ చేయడంతో దుమ్ముధూళితో చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు వృద్ధి చెందుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. పత్తి నిల్వ ఉన్న ప్రతి రైతు కుటుంబానికి ఈ సమస్య తప్పడం లేదు. దీంతో వారు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. కొందరు రైతులు తట్టుకోలేక తక్కువ ధరలకే పత్తి విక్రయిస్తున్నారు.

సస్యరక్షణకు పురుగుమందుల వాడకం

జిల్లాలో రైతులు బీటీ పత్తిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. పురుగు ఉధృతిని తట్టుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు 2001లో ఈ రకం పత్తిని సాగులోకి తెచ్చారు. కొన్నేళ్లపాటు పురుగు ఉధృతిని, తెగుళ్లను బీటీ పత్తి తట్టుకుంది. రానురాను బీటీ రకం పత్తిపై కూడా పురుగు, దోమ ఉధృతి పెరిగింది. తెగుళ్లు కూడా విపరీతంగా పెరిగాయి. పత్తిలో సస్యరక్షణకు రైతులు విపరీతంగా పురుగుమందులు వాడాల్సి వస్తుంది. గతంలో పత్తి పంటకాలంలో నాలుగైదుసార్లు పురుగుమందు పిచికారీ చేసేవారు. ప్రస్తుతం పది నుంచి పన్నెండుసార్లు పురుగుమందులు పిచికారీ చేయాల్సి వస్తుంది. అయినా కూడా దిగుబడులు మాత్రం పడిపోతున్నాయి. పెట్టుబడులు పెరిగి రైతులు ఏటా నష్టాలు చవిచూస్తున్నారు. ఈ ఏడాది కూడా దిగుబడులు తగ్గినా కనీసం గిట్టుబాటు ధర దొరకుతుందని రైతులు వేచిచూస్తున్నారు. ఈ తరుణంలో చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు రైతు కుటుంబాలను పట్టి పీడిస్తున్నాయి. పత్తి పంటపై ఎక్కువగా రసాయనిక పురుగుమందులు పిచికారీ చేయటంతో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

రూ.8.5 వేల నుంచి రూ.7 వేలకు..

జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, చర్ల, దుమ్ముగూడెం, పాల్వంచ, ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లో కొందరు రైతులు పత్తికి గిట్టుబాటు ధరలు రాలేదని నాలుగు నెలల నుంచి పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో పత్తి ధర క్వింటాకు రూ.8,500 వరకు పలికింది. ఆ తర్వాత ధర పడిపోయింది. ప్రస్తుతం పత్తి ధర క్వింటాకు రూ.7 వేలకు చేరింది. దీంతో చాలామంది రైతులు పత్తి ధర మళ్లీ కనీసం రూ.8వేలకు చేరకపోతుందా అనే ఆశతో వందల క్వింటాళ్ల పత్తిని ఇళ్లలోనే నిల్వచేశారు.

ఇబ్బందులు పడుతున్నాం



పత్తికి ఈ ఏడాది గిట్టుబాటు ధర లేకపోవటంతో నాలుగు నెలలుగా ఇళ్లలోనే నిల్వచేశాం. ఎండలు ముదిరాక చర్మంపై ఎర్రగా దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. పత్తిని తక్కువ ధరకు అమ్ముకోలేక., ఇటు చర్మవ్యాధులు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం.

– ఇమదాబత్తుని రామకృష్ణ, రైతు, రెడ్డిపాలెం

దద్దుర్లు, దురదలు..



వర్క్ ఫ్రమ్ హోమ్‌తో ఇంటి వద్దనే సాఫ్ట్‌వేర్ వర్క్ చేస్తున్నాను. మానాన్న పత్తికి ధర లేకపోవటంతో ఇంట్లో పత్తిని నిల్వ చేశాడు. ఎండలు పెరుగుతున్న తరుణంలో ఇంట్లోని వారికి చర్మంపై దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

– యారం బాలకృష్ణారెడ్డి, రైతు కుటుంబ సభ్యుడు, రెడ్డిపాలెం

పురుగుమందుల ప్రభావమే

పత్తి పంటపై రసాయనిక పురుగుమందుల వినియోగం పెరిగింది. పత్తిని ఇళ్లలో నిల్వచేయటంతో రసాయనిక పురుగుమందుల ప్రభావం ఇంట్లోని వారిపై పడుతుంది. దీనిని ఇరిటేటివ్ కాంటాక్ట్ డెర్మాటైటిస్ అంటారు. చర్మంపై ఎర్రని దద్దుర్లు, దురదలు వస్తాయి. వైద్యులను సంప్రదించి మందులు వాడితే ఐదారు రోజుల్లో తగ్గుతుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ అమర్‌సింగ్, డెర్మటాలజిస్ట్, ఖమ్మం

మిర్చి కూలీల వాహనం బోల్తా

- యువతి మృతి, 25 మందికి గాయాలు
- బొలెరో ట్రాలీలో 65 మంది తరలింపు
- వాహనం వెనుక టైరు పంక్చరై ప్రమాదం


సంఘటనా స్థలంలో క్షతగాత్రుల హాహాకారాలు


గాయపడ్డ బాలుడు, మృతి చెందిన వాణి


దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ నుంచి మిర్చి కోతలకు కూలీలను తీసుకొస్తున్న వాహనం బోల్తా పడి ఓ యువతి మృతి చెందింది. మరో 25 మంది గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని చినబండిరేవు గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధి అంబాపేట, మంగళగూడెం, ఇట్టంపల్లి, చెన్నంపేట గ్రామాలకు చెందిన 65 మంది గొత్తికోయలు చర్ల మండలంలో మిర్చి కోతలకు బయల్దేరారు. బొలెరో ట్రాలీ వాహనంలో ఉదయం 4గంటలకు బయల్దేరి వస్తుండగా మండలంలోని చిన బండిరేవు గ్రామం దగ్గరకు రాగానే వాహనం వెనుక టైర్ పంక్చరైంది. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. కూలీలందరూ రోడ్డుపై పడిపోయి గాయపడి ఆర్తనాదాలు చేశారు. గ్రామస్తులు, ఎస్‌ఐ కేశవ్‌రావు క్షతగాత్రులను ఆటోల ద్వారా, 108 వాహనాల ద్వారా వైద్యశాలకు తరలించారు. ములకపాడు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేశాక మెరుగైన వైద్యం కోసం 25 మందిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా తీవ్రంగా గాయపడ్డ తునికి వాణి(18) మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శిశువు పుట్టగానే విక్రయం

చైల్డ్‌లైన్ కాల్‌తో అప్రమత్తమై తిరిగి తల్లి చెంతకు చేర్చిన అధికారులు

పాల్వంచ: ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చిన మహిళకు ఐదో సంతానంగా మగబిడ్డ జన్మించగా, గంటల వ్యవధిలోనే విక్రయించారు. దీంతో 1098 ఫోన్ కాల్ రావడంతో అప్రమత్తమైన అధికారులు శిశువును తిరిగి తల్లి చెంతకు చేర్చారు. ఘటనపై పూర్తి విచారణ కొనసాగుతోంది. ములకలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణికి గత గురువారం పురిటి నొప్పులు రావడంతో పాల్వంచలోని ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డను మరో ఆస్పత్రిలో పీడియాట్రిషన్ వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించుకుని, తిరిగి కాన్పు పొందిన ఆస్పత్రికి తీసుకురాలేదు. ముందస్తు పథకం ప్రకారం బాలింత అక్క అక్కడికి వచ్చి బిడ్డను ఓ జంటకు విక్రయించింది. కాగా చైల్డ్‌లైన్ 1098 నంబర్‌కు రాత్రి 9.30 గంటలకు ఫోన్ రావడంతో బాలల పరిరక్షణ అధికారి హరికుమార్, సీడీపీఓ కనకదుర్గ, చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, పట్టణ ఎస్‌ఐ నరేశ్ అక్కడికి చేరుకుని బాలింతను, వారి కుటుంబీకులను వివరాలు అడిగారు. అనంతరం ఆస్పత్రి వైద్యుడిని ఆరా తీయగా.. తనకూ ఇప్పుడే విషయం తెలిసిందని పేర్కొనడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశువును తీసుకెళ్లిన బాలింత అక్కను రప్పించి.. బిడ్డను తిరిగి రాత్రి 2.30గంటల సమయంలో తల్లి చెంతకు చేర్చారు. అయితే బిడ్డను రూ.50వేలకు విక్రయించినట్లు సమాచారం. మధ్యవర్తి రూ.20వేలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై చైల్డ్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. బిడ్డను తల్లి చెంతకు చేర్చామని తెలిపారు. తల్లికి ఆపరేషన్ జరిగిన నేపథ్యంలో ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా రెండు రోజులు ఆగామని, సోమవారం చైల్డ్ లైన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణ


ప్రభుత్వ స్థలాన్ని శుభ్రం చేస్తున్న పేదలు

అశ్వారావుపేటరూరల్: సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. అశ్వారావుపేట రెవెన్యూ రికార్డు పరిధిలోని సర్వే నంబరు 1228లో ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారి పక్కన గల సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలు ఆక్రమించారు. పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సయ్యద్ సలీం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పేదలంతా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, సీపీఐ ఆధ్వర్యంలో ఆక్రమించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేపట్టి, వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గన్నిన రామకృష్ణ, సయ్యద్ రఫీ, సంఘం కృష్ణమూర్తి, తిర్నాటి సత్యనారాయణ, ఎండి మున్నా, శ్రీను, నాగరాజు, నాగేంద్రబాబు, చీపుల సత్యవతి, షేక్ దిల్షాద్ పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

చర్ల: మండలంలోని కందిపాడు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీలలో ధ్వంసం చేశారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరావు, చర్ల ఎస్సై వెంకటప్పయ్య నేతృత్వంలో సుమారు 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు.

వివాహిత అదృశ్యం

దమ్మపేట: వివాహిత అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన సోయం చంద్రకళ (32) ఈ నెల 11న బ్యాంకు పని మీద వెళ్తున్నానంటూ భర్త సోయం వెంకటేశ్వరరావుకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్క గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్లల్లోనూ వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

డెంగీ జ్వరంతో వ్యక్తి మృతి


వీరభద్రాచారి (ఫైల్)

పాల్వంచ: పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో డెంగీ జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందగా శనివారం మృతదేహాన్ని తీసుకొచ్చారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కాసర్ల వీరభద్రాచారి (39) పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. డెంగీ జ్వరంగా నిర్ధారణ కావడంతో ఖమ్మం, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా, మృతదేహాన్ని శనివారం పాల్వంచకు తీసుకొచ్చారు. మృతునికి భార్య కరుణ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై నలుగురు వ్యక్తులు శనివారం దాడి చేసి గాయపరిచారు. త్రీటౌన్ ఎస్సై సోమేశ్వర్ కథనం ప్రకారం.. గొల్లగూడెం ఏరియాకు చెందిన కత్తుల శివను కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో పట్టణానికి చెందిన బోసు కోటి, కల్లూరి శివ, ఎం.శివ, చందులు కలిసి దుర్భాషలాడారు. రాయితో దాడి చేయగా ముక్కుపై గాయం ఏర్పడి రక్తస్రావమైంది. కాగా తన కుమారుడిని పాతకక్షల నేపథ్యంలో నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని, చంపుతామని కూడా బెదిరించారని శివ తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నెకల్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ముదిగొండ మండలం వల్లాపురానికి చెందిన చల్లా నాగేశ్వరరావు (62), నేలకొండపల్లి మండలం అనాసాగరానికి చెందిన పాల్వాయి రమేష్ (56) తల్లంపాడులో మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

సమస్యలపై పోరాడేది ఎర్రజెండాలే..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరుల్లో కొనసాగిన ప్రజాచైతన్య యాత్ర


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మణుగూరుటౌన్/బూర్గంపాడు/అశ్వాపురం: ప్రజా సమస్యలపై పోరాడేది కేవలం ఎర్రజెండాలు మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర శనివారం బూర్గంపాడు మండలంలోని సారపాక, బూర్గంపాడు, మోరంపల్లిబంజర, లక్ష్మీపురం, అశ్వాపురం మండలం మొండికుంట, అశ్వాపురం మీదుగా మణుగూరు వరకు సాగింది. ఈ సందర్భంగా మణుగూరులో పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఉన్నంత వరకు ఎర్రజెండాలు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాయని అన్నారు. కమ్యూనిస్టుల అండతోనే అనేక పార్టీలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన విషయం ఈ బూర్జువా పార్టీలు మరిచిపోవద్దని హితవు పలికారు. స్థానిక ఎమ్మెల్యేలు సైతం కమ్యూనిస్టుల అండతో గెలిచి తర్వాత అధికార పార్టీలతో కలిసి తమను మోసం చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చిందని, మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లా బాధల జిల్లా అయిందని, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ముంపు ప్రాంతాల ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా పినపాక నియోజకవర్గంలోని సాగు భూములకు సాగునీరు అందించాలన్నారు. సీతమ్మ సాగర్ భూనిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎం, బీఆర్‌ఎస్, టీజేఎస్ నాయకులు సంఘీభావం తెలిపి యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బూర్గంపాడు మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి జగదీశ్వరరావు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, అశ్వాపురం సీపీఎం, టీజేఎస్ నాయకులు స్వర్గం బాలనర్సయ్య, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాది కేశవరెడ్డి, మణుగూరు సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, నెల్లూరి నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు బొల్లోజు అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, నరాటి ప్రసాద్, పేరాల శ్రీనివాస్, అలవాల సీతారామిరెడ్డి, నలజాల సత్యనారాయణ, కమటం వెంకటేశ్వరరావు, అనంతనేని సురేష్, వేల్పుల మల్లికార్జున్, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, జంగం మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా కందకాలు


అనధికారిక ఇసుక రీచ్‌ల వద్ద కందకాలు తీయిస్తున్న పోలీసులు

బూర్గంపాడు: మండలంలోని అనధికారిక ఇసుక రీచ్‌లకు బూర్గంపాడు ఎస్సై సంతోష్ కందకాలు తవ్వించారు. శనివారం సోంపల్లి, బుడ్డగూడెం, సారపాక, తాళ్లగొమ్మూరు, మోతె, ఉప్పుసాక తదితర ప్రాంతాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల వద్దకు వాహనాలు వెళ్లకుండా జేసీబీలతో కందకాలు తీయించారు. శుక్రవారం రాత్రి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రామోజీరావు ఓ విషసర్పం

చంద్రబాబు కరపత్రం.. ఈనాడు

- అక్రమాలకు వజ్రాయుధం.. ఈ పత్రిక
- మార్గదర్శిలో రూ.వేల కోట్ల డిపాజిట్లు మళ్లించిన మాట వాస్తవమే..
- డిపాజిటర్ల భవిష్యత్తు కోసం ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ చేయడం మంచి పని
- ఎన్టీఆర్‌ని చాలా వేధించారు.
- చంద్రబాబు ఏడ్వడానికి.. రామోజీ మంచంపై పడుకోవడానికి కారణం అదే
- చేసిన పాపాలు తిరిగి తగులుతాయని రామోజీ, బాబును చూస్తే తెలుస్తోంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీరావు తోడల్లుడు, డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: రామోజీరావు ఓ విషసర్పమని ఆయన తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈనాడును అడ్డుపెట్టుకుని రాయలసీమ, ఉత్తరాంధ్రలపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా అమరావతిలో కొన్న భూముల కోసం విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనాడు పత్రిక చంద్రబాబు కరపత్రికగా మారిపోయిందన్నారు. గతంలో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసినట్టే ఇప్పుడు సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల గుండెల్లో కొలువైన వైఎస్ జగన్‌ను కూడా గద్దె దించాలని కుట్రలు చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో సీఐడీ అధికారులు ఏ–1గా ఉన్న రామోజీరావును, ఏ–2గా శైలజా కిరణ్‌ను విచారిస్తున్న నేపథ్యంలో సంస్థలో లోపాలు, నిధుల మళ్లింపులను మార్గదర్శిలో చాలా కీలకంగా వ్యవహరించిన రామోజీరావు తోడల్లుడు డాల్ఫిన్ అప్పారావు వివరించారు. ఈ మేరకు 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఈగో ఫీలింగ్‌తో ఈనాడు ప్రారంభమైంది..

ఒకసారి కేఎల్ఎన్ ప్రసాద్‌తో రామోజీరావు మాట్లాడుతున్న సమయంలో మాటామాటా పెరిగింది. పేపర్ ప్రారంభించడమంటే సులభం కాదన్న మాటలతో రామోజీలో ఈగో ఫీలింగ్ తలెత్తింది. ఎందుకు సులభం కాదో చూద్దామని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారు. 1974 ఆగస్టు 10న ఫౌండర్ ఎండీగా నేను వ్యవహరిస్తూ ఈనాడు ప్రారంభించాం. నంబర్‌వన్ పేపర్‌గా వచ్చేంత వరకూ నేను కృషి చేశాను.

రామోజీ దీన్ని ఓర్వలేకపోయారు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చిన్నగా ప్రారంభమైంది. ఆ తర్వాత రామోజీకి బ్రాంచ్‌లు విస్తరించాలన్న ఆలోచన వచ్చింది. విజయవాడ వచ్చినప్పుడు నన్ను పిలిచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ విస్తరిస్తామని చెప్పారు. విజయవాడలో మొదటి బ్రాంచ్ ఏర్పాటు పనుల్ని రెండు మూడు నెలల్లోనే ప్రారంభించాం. ఆ తర్వాత విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు సహా 8 బ్రాంచ్‌లను వెంటనే మొదలుపెట్టాం. క్రమంగా చిట్స్ పెరిగాయి. అప్పట్లో ఆ నగదును ఎటూ మళ్లించకపోవడంతో మార్గదర్శి బాగానే ఉంది. ఇంతలో ఈనాడు క్రమంగా విస్తరించి నంబర్‌వన్‌గా మారింది. ఆ తర్వాత డాల్ఫిన్ హోటల్‌పై దృష్టిసారించాం. ఆ బాధ్యతలు కూడా నేనే తీసుకొని.. అద్భుతంగా తీర్చిదిద్దాను. ఈనాడు, డాల్ఫిన్.. ఇలా అన్నింటిని లీజుకు తీసుకున్న స్థలాల్లోనే నడిపాం. అందుకే మాకు లీజు మాస్టర్లు అని పేరొచ్చింది. నన్ను చూసే ఆ స్థల యజమానులు లీజులకు ఇచ్చారు. దీన్ని కూడా రామోజీ ఓర్వలేకపోయారు. నేను ఎదిగిపోతానేమోననే భయం రామోజీని వెంటాడింది.

అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు..

ఒక స్థాయి వరకూ డిపాజిట్లు తీసుకునేంత వరకూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాగానే ఉంది. ఈ డిపాజిట్లను మొదట ఈనాడు, డాల్ఫిన్ విస్తరణకు తరలించాం. ఎక్కడా ఇబ్బంది కలగకుండా.. లాభాలు రాగానే తిరిగి మళ్లీ మార్గదర్శిలోకి మళ్లించేవాళ్లం. అయితే.. సుప్రీంకోర్టు నిబంధనలను కఠినతరం చేసింది. ఆ సమయంలో ఒక సుప్రీంకోర్టు జడ్జి అభిప్రాయాల్ని తీసుకున్నాం. దాని లూప్‌హోల్‌ని పసిగట్టిన రామోజీరావు మార్గదర్శి డిపాజిట్లను మళ్లించడం మళ్లీ మొదలు పెట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) హెచ్చరించడంతో నిధుల మళ్లింపును నిలుపుదల చేశారు. అయితే అప్పటికే రూ.వేల కోట్లు మళ్లించేశారు. ఈనాడు అప్పటికే అగ్రస్థానానికి చేరుకోవడంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారు. ఆ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ దీనిపై పోరాటం మొదలుపెట్టారు.

వైఎస్సార్ చొరవతో కొంతమందికి చెల్లింపు

2,600 మంది కష్టమర్ల సొమ్మును వెంటనే కట్టాలని ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పటికప్పుడు సొమ్ములు తిరిగి వెనక్కు తీసుకురాలేని తరుణంలో వివిధ అంతర్జాతీయ కంపెనీలతో రామోజీరావు చర్చలు జరిపారు. అయితే అంత పెద్దమొత్తం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రామోజీ.. చంద్రబాబుని సంప్రదించారు. ఆయన రిలయన్స్‌ని, నిమేష్ అంబానీ అనే బ్రోకర్‌ని పట్టుకున్నారు. రామోజీ సంస్థల షేర్లు ఒక్కోటి రూ.500గా ఉంటే రూ.5 వేలుగా చూపించి నిధులు తెచ్చారు. తద్వారా 2,600 మంది కష్టమర్లలో కొంతమందికి చెల్లించారు. అయితే ఎంతమందికి ఇచ్చామనే వివరాల్ని ఇప్పటికీ రామోజీ బయటపెట్టలేదు. పైగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని వాదిస్తుంటారు. అంత పెద్ద వ్యక్తిపైన ఫిర్యాదు చేస్తే.. తమ భవిష్యత్తు ఏమవుతుందనే భయంతోనే డిపాజిటర్లు వెనకడుగు వేశారు. అది కూడా ఆ రోజుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అప్రమత్తమవ్వడంతోనే కొంతమందికి చెల్లించారు.

లెక్కలన్నీ పక్కాగా ఉంటే భయమెందుకు?

వచ్చిన చిట్స్ మొత్తాన్ని రామోజీ ఇష్టం వచ్చినట్లు మళ్లించేస్తుంటే.. భవిష్యత్తులో ఏ చిన్న పొరపాటు జరిగినా లక్షల మందికి ఎలా చెల్లించగలరు? ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనాల్సిన అవసరం ఉంది. మార్గదర్శి డిపాజిటర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే ప్రభుత్వం మార్గదర్శిపై విచారణ ప్రారంభించడం చాలా మంచిపని. లెక్కలన్నీ పక్కాగా ఉన్నప్పుడు రికార్డులు ఇవ్వడానికి భయమెందుకు?

మూడో వ్యక్తికి తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు..

మార్గదర్శిలో మేనేజర్లు అకౌంట్స్ చేయడం, రిజిస్టర్స్ నిర్వహించడం మొదలైనవన్నీ చేయాల్సి ఉంటుంది. కానీ.. వారందర్నీ రామోజీ డమ్మీలుగా చేసేశారు. ఏ బ్రాంచ్‌లో డబ్బులు వచ్చినా ప్రధాన కార్యాలయానికి పంపించాలనే హుకుం జారీ చేశారు. వివిధ జిల్లాల్లో వసూలైన చిట్స్ డబ్బులు మొత్తం ప్రధాన కార్యాలయంలోనే ఉంటాయి. ఏ జిల్లాలో ఎన్ని డిపాజిట్లు ఉన్నాయి.. ఎంత మొత్తం వస్తుంది.. అనేది ఎవరికీ తెలీదు. ఇందులో ఏం జరుగుతుందనేది మూడో వ్యక్తికి కూడా తెలియకుండా రామోజీ, శైలజ జాగ్రత్తపడ్డారు.

రామోజీ భయపడ్డారు..

మార్గదర్శిపై సీఐడీ దాడులతో రామోజీ భయపడ్డారు. అందుకే మంచం పట్టినట్లు కనిపించారు. దాని వల్ల ఎక్కువగా ప్రశ్నించరని అనుకున్నారు. కానీ.. అది వర్కవుట్ కాలేదు. ఆ ఫొటో (మంచంపై పడుకున్న రామోజీని సీఐడీ విచారిస్తున్న) చూశాక నాకే ఆశ్చర్యమనిపించింది. ఆ స్థితిని చూసినప్పుడు ఈ మధ్య చంద్రబాబు ఏడ్చిన విషయం గుర్తొచ్చింది. గతంలో ఆరోగ్యం కూడా బాగోలేని ఎన్టీఆర్‌ని చంద్రబాబు, రామోజీ కలిసి ఏడిపించారు. చాలా మానసిక వేదనకు గురిచేశారు. రామోజీ మంచంపై పడుకోవడానికి.. చంద్రబాబు ఏడవడానికి కారణం కూడా అదే. చేసిన పాపాలు మనకు తిరిగి తగులుతాయని వీళ్లని చూస్తే తెలుస్తుంది. సుమన్ ఉండి ఉంటే.. మార్గదర్శికి సంబంధించి అప్పుడే గొడవలు జరిగి ఉండేవేమో. ఎందుకంటే సుమన్‌కి ఈ తరహా మోసాలు అసలు నచ్చవు.

అక్రమాలకు వజ్రాయుధంగా ఈనాడు..

అన్యాయాలు జరిగినప్పుడు, అక్రమాలు జరిగినప్పుడు ఈనాడుని ఉపయోగిస్తే చాలా బాగుంటుంది. గతంలో అలానే ఉపయోగపడింది. కానీ.. రానురానూ ఈనాడుని స్వార్థానికి ఉపయోగించడం మొదలుపెట్టారు. ఇప్పటికీ అదే పంథాని కొనసాగిస్తున్నారు. తమ అక్రమాలకు పత్రికని వజ్రాయుధంగా మార్చుకున్నారు. ఎన్టీఆర్ రాజకీయంలో అడుగులు వేస్తున్న సమయంలో.. ఈనాడు ఎంతో ఉపయోగపడింది. ఎన్టీఆర్ అసెంబ్లీ టికెట్లు ఇచ్చే విషయంలో ఈనాడు రిపోర్టర్ల ద్వారా అభ్యర్థుల పేర్లని ఎంపిక చేసి నేనే ఉత్తరాంధ్ర నుంచి 37 పేర్లు పంపించాను. దాన్నే ఎన్టీఆర్ పరిగణనలోకి తీసుకోవడం.. వారంతా విజయం సాధించడంతో నాపై ఆయనకు నమ్మకం కలిగింది. ఆ సమయంలో నాకు ఎంపీ టికెట్ ఇవ్వాలని భావించారు. ఆ పేర్ల జాబితాని రామోజీరావుకు ఎన్టీఆర్ వినిపించడంతో.. రామోజీ నన్ను ఫోన్ చేసి అడిగారు. నాకు తెలీదని చెప్పాను. ఎక్కడ రాజకీయాల్లో ఎదిగిపోతానో అనే భయంతో రాజకీయాల్లోకి వద్దని అడ్డుకున్నారు.

టీడీపీకి కరపత్రంగా ఈనాడు మారిపోయింది

ప్రస్తుతం మార్గదర్శిలో జరిగిన అవకతవకలు బయటపడతాయన్న విషయాన్ని రామోజీ గ్రహించారు. వాటిని ప్రజల్లోకి వెళ్లకూడదని భావించారు. అందుకే... టీడీపీ నేతలు, తెలిసినవారితో పత్రికపై దాడి చేస్తున్నారంటూ మాట్లాడిస్తున్నారు. డిపాజిట్లు అంటే ఏమిటో, చిట్స్ అంటే ఏమిటో తెలియనివారు కూడా మీడియా ముందుకు వచ్చి ఈనాడుపై దాడి, మార్గదర్శిపై దాడి అని మాట్లాడుతున్నారు. ఈనాడు తెలుగుదేశం పార్టీకి కరపత్రంగా ఉంది. కాబట్టి.. వారు దీన్ని కప్పిపుచ్చాలని భావిస్తున్నారు. సుప్రీంకోర్టులో ఏం జరుగుతుందనేది చూడాలి. ఇది కరెక్టో, కాదో.. డిపాజిటర్లని విచారించాలి. ప్రతివాదుల్ని పిలవకుండా.. గతంలో కేసు కొట్టించేశారు. ఇప్పుడు మళ్లీ పోరాటం జరుగుతోంది. న్యాయం ఆలస్యమవ్వొచ్చు కానీ.. ధర్మం ఎప్పటికైనా గెలుస్తుంది. ఇప్పుడు మార్గదర్శికి ఈ పరిస్థితి వచ్చిందంటే దానికి రామోజీరావే ప్రధాన కారణం.

రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది..

ఇదంతా.. తన సామ్రాజ్యం.. ఇందులో వేరెవరికీ చోటుండకూడదని రామోజీరావు ఎప్పుడూ భావిస్తుంటారు. దీనికి చంద్రబాబు సహకారం అందించారు. ఎన్టీఆర్‌ని పదవీచ్యుతుడిని చేశాక ఇద్దరూ ఒక్కటైపోయారు. అప్పటి నుంచి రామోజీకి తానే చక్రవర్తిననే అహం పెరిగిపోయింది. ఫిల్మ్‌సిటీని 1,000 నాగళ్లతో దున్నించేస్తానని కేసీఆర్ చెప్పడంతో.. ఆయనను మభ్యపెట్టేందుకు కేసీఆర్‌తో చర్చలు జరిపారు. ఓం సిటీ కడతానని ప్లాన్లు చూపించారు. ఇది ఫిల్మ్‌సిటీని మించిపోతుందని నమ్మించారు. దాన్ని మోదీకి కూడా చూపించారు. కానీ.. ఓం సిటీ ఏమైంది..? పేపర్లకే పరిమితమైంది.

రామోజీ.. కీలక 'లేఖ'పై కిమ్మనరెందుకు?

వివేకా హత్య కేసులో అసలు నిజాలు ఎందుకు రాయరు?

- అప్పుడే దానిని పోలీసులకు ఎందుకు ఇవ్వలేదని ఎప్పుడైనా రాశారా?
- తామొచ్చే వరకు దాచి పెట్టండని వివేకా అల్లుడు, అతని అన్న ఎందుకు చెప్పారు?
- కీలకమైన ఈ విషయంపై దర్యాప్తు సాగడం లేదని ఎందుకు చెప్పరు?
- వివేకా చనిపోయారని అందరికీ చెప్పింది వివేకా అల్లుడు, అతని అన్న కాదా?
- ఈ విషయాలన్నీ వదిలి దర్యాప్తును పక్కదోవ పట్టించేలా మీ రాతలేంటి?
- ఎవరిని తప్పించాలని.. ఎవరిని ఇరికించాలని ఈ రాతలు?

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా ఈనాడు రామోజీ కంకణం కట్టుకున్నారు. ఘటనా స్థలంలో దొరికిన అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న లేఖ, సెల్‌ఫోన్‌ను వెంటనే ఎందుకు పోలీసులకు స్వాధీనం చేయలేదనే అంశాన్ని ఏనాడైనా రాశారా రామోజీ? ఈ కేసులో తొలి నుంచీ ప్రతి విషయంలో మీ వక్రీకరణ కనిపిస్తూనే ఉంది. ఎప్పుడు ఏ చిన్న విషయం తెలిసినా.. దానిని ప్రభుత్వానికి, ఎంపీ అవినాశ్‌రెడ్డికీ ముడిపెట్టి లేనిపోని విషయాలు కలిపి చెలరేగిపోతూ వండివార్చడమే మీరు పనిగా పెట్టుకోవడం నిజం కాదా? అసలు వివేకా కేసులో ఇంత గందరగోళానికి కారణం ఏమిటని ఏనాడైనా తొంగి చూశారా? వైఎస్ వివేకానందరెడ్డిపై తీవ్రంగా దాడి చేసిన ఆగంతకులు ఆయనతో బలవంతంగా ఓ లేఖ రాయించారు. తనను డ్రైవర్ ప్రసాద్ తీవ్రంగా గాయ పరచినట్టుగా ఆ లేఖలో వివేకా రాసినట్టుగా ఉంది. ఆ లేఖ ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ రోజే అంటే 2019 మార్చి 15న ఉదయమే గుర్తించారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని మొదటగా చూసింది ఆయనే. ఆ లేఖతో పాటు వివేకానందరెడ్డి సెల్‌ఫోన్‌ను కూడా ఆయన స్వాధీనం చేసుకున్నారు. వివేకానందరెడ్డి మరణించిన సమాచారాన్ని ఆయన భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్‌రెడ్డిలకు ఫోన్ చేసి చెప్పారు. వివేకానందరెడ్డి మృతదేహం ఫొటోలను కూడా వాట్సాప్ చేశారు. ఆ ఫొటోలు చూస్తే ఎవరికైనా అది హత్య అని సులువుగా తెలుస్తుంది. ఆ లేఖను తాము వచ్చే వరకు ఎవరికీ ఇవ్వొద్దని.. ఆ విషయం బయటకు చెప్పొద్దని వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. దాంతో ఆ లేఖ విషయం ఆయన పోలీసులకుగానీ ఇతరులకుగానీ చెప్పనే లేదు. అనంతరం వివేకానందరెడ్డి పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి చెప్పడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డికి విషయం తెలిసింది. దాంతో ఎన్నికల ప్రచారానికని బయలు దేరిన ఆయన వెనుదిరిగి వివేకా నివాసానికి చేరుకున్నారు. అప్పుడు కూడా వివేకానందరెడ్డి రాసిన లేఖ విషయాన్ని పీఏ కృష్ణారెడ్డి ఎవరికీ చెప్పనే లేదు. ఆ లేఖ విషయం అప్పుడే చెప్పి ఉంటే వివేకానందరెడ్డిది హత్య అని వెంటనే తెలిసేది. ఈ విషయం కదా తొలుత తేలాల్సింది. అది తేలితే తర్వాత కథ వేరుగా ఉండేది. ఈ విషయాలపై దర్యాప్తు సాగాలని ఏనాడైనా ఈనాడు రాసిందా? అంటే మీ ఉద్దేశం అసలు దోషులను తప్పించి.. ఇంకెవరినో ఇరికించాలనేగా! ఆ దిశగా దర్యాప్తు సాగేలా.. దర్యాప్తు సంస్థను ప్రభావితం చేసేలా తప్పుడు కథనాలు వండివార్చుతున్నది అందుకేగదా..

ఇది మీకు కనిపించలేదా?

సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డి ఆ రోజు అంటే 2019 మార్చి 15న మధ్యాహ్నం 12 – ఒంటి గంట మధ్య పులివెందులకు చేరుకున్నారు. అప్పుడు పీఏ కృష్ణారెడ్డి ఆ లేఖను వారికి అందించారు. వారు దానిని సాయంత్రం 5 గంటల వరకు వారి వద్దే ఉంచుకున్నారు. ఆ తర్వాత తిరిగి వాటిని కృష్ణారెడ్డి ద్వారా పోలీసులకు అందించారు. ఆ సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లు, ఇతర డాటాను డిలీట్ చేసి మరీ పోలీసులకు ఇచ్చినట్టు సమాచారం. సహజంగా ఆ లేఖ విషయాన్ని వెంటనే చెప్పకుండా గోప్యంగా ఉంచిన పీఏ కృష్ణారెడ్డిని తొలుత ఎందుకు ప్రశ్నించలేదని, ఎవరి ఆదేశాల మేరకు ఆ లేఖ విషయాన్ని రహస్యంగా ఉంచారో ఎందుకు తెలుసుకోలేదని.. అందువల్లే ఈ కేసులో కీలకమైన చిక్కుముడి విడిపోవడం లేదని ఎందుకు మీ రాతల్లో కనిపించదు రామోజీ? విషయం అందరికీ తెలిశాక.. ఘటనా స్థలానికి చేరుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని.. వారిని దోషులుగా చూపుతూ దుష్ప్రచారం చేయడం మీకే చెల్లింది. వివేకా హత్య జరిగిన రోజు ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి అవినాశ్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లానని ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆ రోజూ చెప్పారు. ఈ రోజూ అదే చెబుతున్నారు. ఓ పని కోసం ఎంపీ ఇంటికి వెళ్లానని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శశికళ కూడా ఆరోజు, ఈ రోజు అదే చెబుతోంది. ఎంపీ ఇంటి వద్ద ఉన్నామని వాళ్లే స్వయంగా చెబుతున్నప్పుడు.. ఆ విషయం కొత్తగా కనిపెట్టినట్టు మీరు చెప్పడం ఏమిటో!

ఉదయ్‌ను పోలీస్ కస్టడీకి ఇవ్వండి

వివేకా హత్య కేసులో అరెస్టయిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ సీబీఐ కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిగే అవకాశం ఉంది.

గని కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెస్క్యూ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయంలో శనివారం గని కార్మికులకు సీపీఆర్‌పై రెస్క్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా సేఫ్టీ ఆఫీసర్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల వయసుతో ప్రమేయం లేకుండా పలువురు గుండె పోటు బారిన పడి మృతి చెందుతున్నారని తెలిపారు. అయితే, తక్షణమే సీపీఆర్ చేయగలిగితే వారు బతికే అవకాశముంటుందన్నారు. ఈ నేపథ్యాన కార్మికులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జ్‌లు అనంతరామయ్య, మధుబాబుతో పాటు బి.మాధవ్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయంలో జడ్జి శ్యాంసుందర్, కుటుంబీకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తి ఎస్.శ్యాంసుందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత పండితులు వేదాశీర్వచనం చేయడంతో పాటు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, 1,278 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అలాగే, పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 817 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.

జిల్లా వార్తలు

మేం ఆడించేదే ఆట..



పరుగుపందెం పోటీలో పాల్గొన్న క్రీడాకారులు (ఫైల్)

- ఒక్కో క్రీడాంశానికి రెండేసి సంఘాలు
- ఎవరి తరఫున ఆడాలో తేల్చుకోలేక క్రీడాకారుల సతమతం
- కొన్నింటికి గుర్తింపు లేకుండా యథేచ్ఛగా కార్యకలాపాలు
- అయినా దృష్టి సారించని అధికారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఇబ్బడిముబ్బడిగా క్రీడా సంఘాలు పుట్టుకొస్తుండటంతో ఏది అసలు, ఏది నకిలీ సంఘమో తేల్చుకోలేక క్రీడాకారులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతీ క్రీడాంశానికి సంబంధించి రెండు.. కొన్నిచోట్ల మూడు సంఘాలు ఉండటం గమనార్హం. సుదీర్ఘ కాలం నుంచి ఉన్న క్రీడా సంఘం తరఫున ఆడితే అందే సర్టిఫికెట్లు తమకు భవిష్యత్‌లో ఉపయోగపడతాయని క్రీడాకారులు భావిస్తారు. కానీ పలు సంఘాలు ఉండడంతో ఏ సంఘం తరఫున ప్రాతినిధ్యం వహిస్తే సర్టిఫికెట్ వస్తుందో, రాదో తెలియక.. వచ్చినా ఉపయోగముంటుందా అనే మీమాంస వారిని వెంటాడుతోంది. ఇటీవల ఒక క్రీడా సంఘం తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు చేదు అనుభవం ఎదురైంది. సంబంధిత సంఘం తరఫున వెళ్లిన వారికి అందిన సర్టిఫికెట్లు చెల్లవని తేలడంతో నివ్వెరపోయారు. ఇకనైనా శాట్స్ బాధ్యులతో పాటు క్రీడా, యువజన శాఖ అధికారులు స్పందించి క్రీడాసంఘాల ముసుగులో మోసాలకు పాల్పడుతున్న వారి ఆటలకు అడ్డుకట్ట వేయడమే కాక తమకు న్యాయం చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

సరికొత్త క్రీడాంశాలతో సంఘాలు

విభిన్న రకాల క్రీడల పేర్లతో నూతన సంఘాలు పుట్టుకొస్తున్నాయి. వీటి నిబంధనలు పాత క్రీడలను పోలి ఉంటాయి. అనంతరం నేరుగా రాష్ట్రస్థాయిలో ఎంపికలు, జాతీయస్థాయిలో పోటీలు, ఆపై అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. ఇక అంతర్జాతీయ స్థాయి పోటీలు కేవలం నేపాల్, శ్రీలంక దేశాల్లో మాత్రమే జరుగుతుండటం.. నిర్వహణ, క్రీడాకారుల శిక్షణ, రవాణా పేరిట పలువురు ప్రజాప్రతినిధులను ఆశ్రయించి నిధులు సేకరిస్తున్నారు. తీరా టోర్నమెంట్‌కు వెళ్లి వచ్చాక తాము ఆడింది నకిలీ టోర్నీ అని తెలియడంతో క్రీడాకారులు నివ్వెరపోతున్నారు. ఔత్సాహిక క్రీడాకారులనే లక్ష్యంగా చేసుకుని పలువురు ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

'శాట్స్' దృష్టి సారించాలి..

ఒక్కో క్రీడకు రెండేసి సంఘాలు, సరికొత్తగా పుట్టుకొస్తున్న క్రీడా సంఘాలపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) దృష్టి కేంద్రీకరించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. ఒలింపిక్, క్రీడా సంఘాలతో కమిటీ వేసి తనిఖీలు చేయగలిగితే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇకనైనా మరికొందరు ఔత్సాహిక క్రీడాకారులు నష్టపోకముందే శాట్స్ దృష్టి సారించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

ఫెడరేషన్‌లో గొడవలే కారణం

జాతీయస్థాయిలో ఏర్పడే క్రీడా సంఘానికి సంబంధించిన ఫెడరేషన్ బాధ్యులు రెండు వర్గాలుగా విడిపోవడంతో జాతీయస్థాయిలో రెండు క్రీడా సంఘాలు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. ఆయా సంఘాల బాధ్యులు తమ అధిపత్యం కొనసాగించేందుకు క్రీడాకారులను పావులుగా వాడుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎవరికి వారు తమకే గుర్తింపు ఉందని, భారత క్రీడా మంత్రిత్వ శాఖ అనుమతి లభించిందని చెప్పుకుంటున్నారు. ఇందులో కొన్ని సంఘాల బాధ్యులు కోర్టుకు వెళ్లామని, తమకే అనుకూలంగా అనుమతి లభించిందని చెప్పుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా వీటిని నియంత్రించాల్సిన రాష్ట్ర, జిల్లా ఒలింపిక్ క్రీడా సంఘాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మిమ్మల్ని దించడానికి అందరూ సిద్ధం



ముదిగొండ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- బీఆర్ఎస్‌ను ఉద్దేశించి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ముదిగొండ, చింతకానిలో క్యాంపు ఆఫీస్‌ల ప్రారంభం

ముదిగొండ/చింతకాని: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని దించడానికి లక్షలాది మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముదిగొండ, చింతకానిలో ఏర్పాటుచేసిన క్యాంపు కార్యాలయాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలువురు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో పొంగులేటి మాట్లాడుతూ తాను మాటల మనిషిని కాదని, అభిమానం ఉన్న వారంతా గూటికి చేరాలని కోరుతున్నట్లు తెలిపారు. అధికార అహంకారంతో ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చినట్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతుల రుణ మాఫీ తదితర పథకాలేవీ సంపూర్ణంగా అమలు కాలేదని ఆరోపించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ తొలగించడమే కాక రైతుబంధు పథకంతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు సీఎం ప్రకటించిన రూ.10 వేలు పరిహారం ఇంకా అందలేదన్నారు. దళితబంధు పథకాన్ని హుజూరాబాద్‌తో పాటు రాష్ట్రంలో నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా, మిగతా నియోజకవర్గంలో 100 మందికి అమలుచేస్తామని చెప్పినా వంద శాతం ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. ఇలాగే చేస్తూ వెళ్తే ఇంకా ఇరవై ఏళ్లు పడుతుందని స్పష్టం చేశారు. కాగా, తనకు పదవి ఉన్నా, లేకున్నా ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానని పొంగులేటి వెల్లడించారు. పార్లమెంట్ టికెట్ దగ్గర నుంచి తనను అనేక అవమానాలకు గురిచేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ వెనుకడుగు వేయలేదని తెలిపారు. ఏదిఏమైనా ఉమ్మడి జిల్లా ప్రజల దీవెనలతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అసెంబ్లీ గేటు తాకకుండా చేయడమే తమ లక్ష్యమని శ్రీనివాసరెడ్డి చెప్పారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు వాకదాని కన్నయ్య, జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, ఏలూరి హనుమంతరావు, వట్టికూటి సైదులుగౌడ్, కందుల రంగారావు, అవులూరి వెంకటేశ్వరరెడ్డి, కోట రాంబాబు, మందడపు తిరుమల్‌రావు, తుళ్లూరి బ్రహ్మయ్య, ఉమ్మినేని కృష్ణ, భూక్యా సైదానాయక్, కిలారు జగన్మోహన్‌రావు, మనోహర్‌బాబు, నారపోగు వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సీతారామయ్య, మందడపు శ్రీను, సారిక సైదులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో తలనీలాలకు రూ.24.60 లక్షలు



పెద్దమ్మ గుడి వద్ద వేలం నిర్వహిస్తున్న చైర్మన్ రామలింగం, ఈఓ రజనీకుమారి తదితరులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వివిధ పనులు అప్పగించేందుకు శనివారం వేలం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి, ఈఓ రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ మహిపతి రామలింగం సమక్షాన వేలం సాగింది. ఈ సందర్భంగా భక్తుల తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం 12 మంది పాల్గొనగా, భద్రాచలానికి చెందిన చెందిన జె.శ్రీరామ్ రూ.24.60 లక్షలతో దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.13.31 లక్షలు మాత్రమే పలకగా ఈసారి రూ.11.29 లక్షల ఆదాయం అదనంగా లభించింది. అలాగే, పాత సామగ్రి వేలం పాటలో పాల్వంచకు చెందిన మల్లేశ్‌నాయుడు రూ.32.500కు సొంతం చేసుకున్నాడు. కాగా, కొబ్బరికాయల దుకాణాలు, పూలదండల విక్రయం, ఫొటోలు తీయడం, టెంట్ సామగ్రి సరఫరా, చీరల కోసం టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ నెల 26వ తేదీకి వాయిదా వేశారు. ఇక కొబ్బరికాయల దుకాణాల అద్దె గడువు ఆదివారం ముగియనుండగా, వ్యాపారులు టెండర్లు వేయకపోవడంతో ఈఓ వారితో మాట్లాడారు. అద్దె పెరిగిన నేపథ్యాన తాము పాల్గొనలేదని వారు చెప్పడంతో.. మళ్లీ టెండర్ నిర్వహించే నాటికి అద్దె ఖరారు చేసేలా నిర్ణయించినట్లు ఈఓ తెలిపారు.

పువ్వాడను పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జాతీయ నాయకులు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తండ్రి పువ్వాడ నాగేశ్వరరావును శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. అస్వస్థతకు గురైన ఆయన రెండు వారాలుగా హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడరు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థి దశలోనే పొదుపు చేసుకోవాలి

లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంరెడ్డి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థి దశలోనే నగదు పొదుపు చేసుకునేలా అలవాటు చేసుకోవాలని.. తద్వారా ఆర్థిక అక్షరాస్యత పెరుగుతుందని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంరెడ్డి తెలిపారు. అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్ట్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పొదుపు చేసుకునే నగదును సురక్షితమైన పథకాల్లో జమ చేయాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియంత్రిత సంస్థల్లోనే డిపాజిట్ చేయడం, అప్పు తీసుకోవడం ద్వారా నష్టాలు ఎదురుకావన్నారు. అలాగే, ఆన్‌లైన్, సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులతో పాటు కౌన్సిలర్లు వి.అంజిబాబు, డి.చంటి, రావుల ముత్తు పాల్గొన్నారు.